# కాన్వెంటు కల్చరు

ఉదయం 8-00 గంటలు.

"టు, జీరో: ట్వెంటీ"

"టు, జీరో: ట్వెంటీ"

"టు, వన్: ట్వెంటీ వన్"

టు, వన్: ట్వెంటీ వన్"

"అలాగే త్రీ, జీరో: థర్టీ వరకు చదువు" అంది జయంతి. వారం రోజుల క్రితం హైదరాబాద్‌కి తీసుకు వచ్చిన అక్క కొడుకు 'నానీ'ని ముందు రోజు కాలనీ లోని 'ప్రీమియర్ పబ్లిక్ స్కూల్'లో చేర్పించింది. పల్లెటూరు నుండి వచ్చిన నానీకి ఇంగ్లీష్ మీడియం చదువు త్వరగా వంటబట్టడానికని ఉదయాన్నే స్కూల్‌కి వెళ్ళే ముందు ఒక గంటసేపు తను ట్యూషన్ చెప్పాలని నిశ్చయించుకుంది.

"పిన్నీ... త్రీ, జీరో: థర్టీ వరకు రాసేశా" నోట్‌బుక్ చూపించాడు.

"పిన్ని కాదు ఆంటీ అనాలి,... ఏం చెప్పాలన్నా ఇంగ్లీష్ లోనే చెప్పాలి తెలిసిందా" వచ్చే ముందు అక్క చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకుంటూ చెప్పింది జయంతి.

"సరే"

"అదిగో మళ్ళీ తెలుగు, 'ఓకే' అనాలి"

"ఓ...కే."

"గుడ్ వెళ్ళి యూనిఫాం వేసుకో స్కూల్‌కి టైమవుతూంది."

నానీ తయారయి బాగ్ తగిలించుకుని వీధిలో నిలిచి వున్న రిక్షా ఎక్కి "వెళ్ళొస్తాను పిన్నీ" అన్నాడు.

"ఎన్నిసార్లు చెప్పాను. ఏం చెప్పినా ఇంగ్లీష్ లోనే చెప్పాలని, ఊ... సే యిట్ యిన్ ఇంగ్లీష్" కోపంగా చూసింది జయంతి.

"టాటా... ఆంటీ" చెయ్యి ఊపుతూ బిక్క ముఖం వేసుకుని చెప్పాడు నానీ.

* * *

సాయింకాలం 4-00 గంటలు.

"నానీ మిల్క్ తాగేసి హోమ్‌వర్క్ చేసుకో"

"ఆంటీ... మిల్క్‌లో చీమలున్నాయి."

"మళ్ళీ చీమలంటున్నావు. యాంట్స్, యాంట్స్" విసుక్కుంటూ వచ్చింది వంటింటిలోనుండి.

"యాంట్స్... యాంట్స్ ఉన్నాయి" గ్లాసు చూపించాడు.

వాటిని తీసివేసి "తాగు" అంది.

నానీ పాలు తాగేసి హోమ్ వర్క్ బుక్ అందు కున్నాడు.

"ఆర్, యి, డి: రెడ్, బి,ఎల్,ఎ,సి,కే: బ్లాక్... ... ... త్రీ, జీరో: థర్టీ, త్రీ వన్: థర్టీ వన్... ... ... ఫోర్, జీరో: ఫార్టీ. ఆంటీ రాసేశా" హోమ్ వర్క్‌బుక్ షెల్ఫ్‌లో పడేసి వంటింట్లోకి పరుగెత్తాడు నాని.

"వీధిలో తేజా వాళ్ళు క్రికెట్ ఆడుతున్నారు. నువ్వు కూడా వెళ్ళి ఆడుకో" చెప్పింది. నానీ తూనీగ లాగా పరిగెత్తాడు.

* * *

రాత్రి 10-00 గంటలు.

"ఆంటీ... కథ చెప్పవూ" అలవాటుగా అడిగాడు నానీ.

"వన్సపాన్ ఎ టైమ్ దేర్ వాజ్ ఎ కింగ్: చాలా, చాలా రోజుల క్రితం ఒక ఊరిలో ఒక రాజుండే వాడు"

"ఊ"

"వన్ డే ది కింగ్ సెడ్ టు హిస్ మినిస్టర్ 'లెటస్ గో ఫర్ హంటింగ్ టుమారో! ఒక రోజు మంత్రిని పిలిచి రేపు వేట వెళ్ళేందుకు అన్ని ఏర్పాట్లూ చెయ్యండి అన్నాడు"

"పిన్నీ... సారీ, ఆంటీ..." మధ్యలో ఆగాడు.

"ఏంటీ" అడిగింది జయంతి.

"ఆంటీ రాజు గారు కూడా కాన్వెంట్‌లో చదువు కున్నాడా" తన చిన్న బుర్రలోకి వచ్చిన సందేహాన్ని బయట పెట్టాడు నానీ.

—దువ్వూరి రాజారెడ్డి


తత్వజిజ్ఞాస మానవ నాగరికతకే పునాది వంటిది. వివిధ కాలాలలో ప్రజల మత, సాంఘిక, వైదిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల మీద, విశ్వాసాల మీద ఆయా కాలాలనాటి తత్వవేత్తల ప్రభావం ఎంతో వున్నది.

ప్లేటో, అరిస్టాటిల్, దెకార్త్, స్పినోజా, కాంట్, హెగెల్, మార్క్స్, బెర్గ్‌సన్, సార్త్ర- ఇంకా ఎందరో పాశ్చాత్య దార్శనికులు విశ్వతత్వం గురించి, మానవ జీవిత ధ్యేయం గురించి చేసిన చర్చను, సిద్ధాంతాలను వారి జీవిత విశేషాలతో సహా వివరిస్తూ ఆసక్తికరంగా, ఒక కథ వలె చకచక చదివించే సరళ శైలిలో రచించిన గ్రంథం

వెలువడింది!




"విశ్వదర్శనం"

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికంగా వెలువడి

పాఠకుల ప్రశంసలు చూరగొన్న వ్యాసాల సంకలనం—

తెలుగు పాఠకులకు తులలేని కానుక—

ప్రతి జిజ్ఞాసువు తప్పక చదవదగిన రచన—

నవోదయ

'విశ్వదర్శనం' సాదా ప్రతి - 75 రూ.లు.

మేలు ప్రతి - 100 రూ.లు.

నవోదయ పబ్లిషర్స్

విజయవాడ . గుంటూరు